క్లుప్తంగా

ఉచితంగా శవపేటికల అందజేత



కృష్ణా: సమాజానికి ఏదోరూపకంగా సహాయం చేయాలనే తలంపుతో మండల జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మపాటీల్, బీఆర్ఎస్ మండల నాయకులు శివరాజ్‌పాటీల్ రూ. 65వేల విలువగల శవపేటికను శనివారం మండల ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి మనిషికి మృతి చెందిన చివరి క్షణంలో జరిగే అంతిమయాత్ర కూడా విజయవంతంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ శవపేటికను ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఇకముందు కూడా ఇలాంటి సేవ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు సురేష్, లక్ష్మీనారాయణ, సంగప్పగౌడ, శంకర్, జయప్రకాష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ధన్వాడ: మండలంలోని గున్ముక్ల కడపరాయ స్వామిజాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం మంత్రోనిపల్లిలో ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి సింధూరం పూసి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పురోహితులు నర్సింహాచారి, పూజారులు తిమ్మయ్య, రాములు, మహాదేవ్, చెన్నప్ప, లక్ష్మయ్య, రాజు, ఆంజనేయులు, వెంకటస్వామి, హన్మంతు, కృష్ణయ్య, బాలమణి, వెంకటేష్, రవి, నారాయణ, అనంతయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు సన్మానం



నారాయణపేట రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యను అభ్యసించి డీఎస్సీ 2024లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన పాఠశాల పూర్వ విద్యార్థులను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఎంతో పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాలరాజు, దూస సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి



మక్తల్: మండలంలోని మంతన్‌గోడ గ్రామం శివారులోని కోడిపందేల స్థావరంపై శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ. 10వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాలుగు సెల్‌ఫోన్‌లు, నాలుగు బైక్‌లు, 8కోడి పుంజులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

నేటి నుంచి ఆంజనేయస్వామి ఉత్సవాలు

మక్తల్: మండలంలోని ఉప్పర్‌పల్లిలో రాజమూర్ ఆంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం పల్లకి సేవ, తెల్లవారుజామున ప్రభోత్సవం, 16న రథోత్సవం, సాయంత్రం పాలఉట్ల కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

నారాయణపేట రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక దీక్షలు మూడవ రోజుకు చేరాయి. శనివారం శ్రీ వివేకానంద పార్క్ ఎదురుగా ఏర్పాటుచేసిన శిబిరంలో కళ్లకు గంతలు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. వీరికి పీడీఎస్‌యూ, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. విద్యాశాఖలో సమగ్రశిక్ష ఉద్యోగులని విలీనంచేసి వారి సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బలరాం, వెంకట్రంరాంరెడ్డి, సాయికుమార్, వెంకటేష్, విజయ, అల్తాఫ్, రాజు, శాలిని, రాజేష్, లక్ష్మణ్, శశికాంత్ రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నారాయణపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి అబ్దుల్ రెహమాన్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న న్యూ కామన్ డైట్ మెనూను శనివారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. పాఠశాలలోని వంటగది, బియ్యం కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గురుకుల్లో ఒకే తరహా భోజనం అందించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఈఓ బాలాజీ, జిల్లా మైనారిటీ అధికారి ఎంఏ రషీద్, ప్రిన్సిపాల్ జగదీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



నారాయణపేటలో మెనూను ప్రారంభిస్తున్న డీఎఫ్ఓ అబ్దుల్ రెహమాన్

పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలి..

నారాయణపేట రూరల్/ఎడ్యుకేషన్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని స్థానిక మైనారిటీ గురుకుల పాఠశాలలో శనివారం కామన్ డైట్ మెనూను ఆమె ప్రారంభించారు. అనంతరం పలు రికార్డులు, పరిసరాలు, భోజనశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇకనుంచి నూతన డైట్ ప్రకారం పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఖాజా మహబూబ్ ఖాన్, తల్లిదండ్రులు, సిబ్బంది అబ్దుల్ అలీం, నారాయణ, శివ, సుదర్శన్, ఖదీర్, హిరణ్, పవన్, విజయ భాస్కర్, నివేదిత, ఫరీదా, ఖలీదా పాల్గొన్నారు.

నాణ్యతలో జాగ్రత్తలు తీసుకోవాలి..

మక్తల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా డీఆర్‌డీఏ పీడీ మొగులప్ప అన్నారు. శనివారం పట్టణంలోని పలు గురుకుల బాలికల పాఠశాలలో సీఎం రేవంత్‌రెడ్డి గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన న్యూ కామన్ డైట్ మెనూ పథకాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. వంట గదుల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యతలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ సురేష్, ప్రిన్సిపాల్ రేణుక, సతీ ష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి..

ఊట్కూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తహసీల్దార్ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అనంతరం తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజ నం అందిస్తుందన్నారు. ఏఓ గణేష్‌రెడ్డి, వార్డెన్ జగదీశ్వర్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సదుపాయాలు వినియోగించుకోవాలి

ధన్వాడ: విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ సాయిప్రకాష్ అన్నారు. మండలంలోని ఎస్సీహాస్టల్, కొండాపూర్ గిరిజన గురుకులాల్లో కామన్‌డైట్ మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

కామన్ డైట్ మెనూ ప్రారంభం

మాగనూర్: హాస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అధికారులు హీర్యానాయక్, పొలపల్లి కిష్టప్ప తెలిపారు. మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహాలలో కామన్‌డైట్ మెనూ ప్రారంభించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ అఫ్జల్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతి గృహం తనిఖీ

మద్దూరు: మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని స్థానిక తహసీల్దార్ మహేష్ గౌడ్, ఎంపీడీఓ నర్సింహారెడ్డి ఎస్సీహస్టల్ వార్డెన్‌ను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.



పేటలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి



మక్తల్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ పీడీ

అనంతరం వసతిగృహ పరిసరాలను వంటగదిని పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింహులు, ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎంపీఓ రామన్న, వార్డెన్ వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోస్గిరూరల్: పట్టణంలోని పలు గురుకుల విద్యాలయాలలో ప్రభుత్వం అమలు చేసిన కొత్త మెనూను ఎంఈఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్‌లు వెంకటేష్, చంద్రశేఖర్, మక్సూద్ తదితరులు ఉన్నారు.



కోస్గిలో..



మద్దూర్‌లో..



మాగనూర్‌లో మాట్లాడుతున్న అధికారులు



ఊట్కూర్‌లో మాట్లాడుతున్న అధికారులు



ధన్వాడలో..

మండల యాదవ కమిటీ ఎన్నిక



మద్దూరు: అఖిల భారత యాదవ మండల కమిటీని శనివారం జిల్లా కమిటీ నాయకులు రఘువీర్ యాదవ్ సమక్షంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదవ కమిటీ అధ్యక్షుడిగా దోరెపల్లి గ్రామానికి చెందిన మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా సాయిని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ.. యాదవులు కులవృత్తులతో పాటు చదువుల్లో రాణించి సమాజంలో ప్రత్యేక స్థానం పొందాలని సూచించారు. కార్యక్రమంలో రాములు, గోవర్దన్, మన్యం యాదవ్, వెంకటయ్య, బస్వరాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో విఫలం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

దామరగిద్ద: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాల్, మండల కార్యదర్శి అంజిలయ్యగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ.. కోడంగల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టడంపై సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులు మాత్రం ప్రారంభం కాలేదన్నారు. రైతులకు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణ్, మొగులప్ప, సాదు, కన్కప్ప, శ్రీనివాస్ సాయిలు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

నారాయణపేట టౌన్: పట్టణ, గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ముందుంటుందని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.రాజ్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వారి కార్యాలయంలో అథ్లెటిక్స్ క్రీడాకారులకు రూ.35వేల విలువ చేసే స్పోర్ట్స్ డ్రస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదరికంతో విద్యార్థులు చదువుకు, ఆర్థిక ప్రోత్సాహం కరువైన క్రీడాకారులకు ఫౌండేషన్ చేయూత అందిస్తుందన్నారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాజ్‌కుమార్‌ను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ సురేష్, డైరెక్టర్ రమణ, శ్రీధర్, నర్సింహులు, తిప్పన్న, బాలాజీ, గోపాల్ పాల్గొన్నారు.



స్పోర్ట్స్ డ్రస్‌లను అందిస్తున్న భీష్మ ఫౌండేషన్ సభ్యులు

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఊట్కూరు: కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని సికింద్రాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారావు అన్నారు. శనివారం మండలంలోని బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో త్వరతగతిలో బూత్ కమిటీలను ఏర్పాటుచేసి, మండల కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ ఎంపీటీసీ హన్మంతును పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, భాస్కర్, కృష్ణయ్యగౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామచంద్రారావు

మార్మోగిన హనుమాన్ నామస్మరణ

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని బసవేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం సాయంత్రం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంతో భక్తుల హనుమాన్ నామస్మరణంతో నగరమంతా మార్మోగింది. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి హిందూ ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ రాంబాబు, ఆర్ఎస్ఎస్ సంఘ్ చాలక్ డాక్టర్ మధన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ హనుమాన్ చాలీసా విశిష్టత, ప్రాముఖ్యతపై వివరించారు. ప్రతి శనివారం హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం కొనసాగుతుందన్నారు. ఇకనుంచి ప్రతినెల చివరి శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం పట్టణంలోని ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్, హిందూ ఐక్యవేదిక సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హిందూ ఐక్యవేదిక కన్వీనర్



సామూహిక హనుమాన్ చాలీసాలో పాల్గొన్న భక్తులు

కనులపండువగా రథోత్సవం

మక్తల్: మండలంలోని మంతన్‌గౌడ్ దత్తాత్రేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రథోత్సవం కనులపండువగా సాగింది. రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం స్వామి వారిని డోలాహారణం, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గసభ్యుడు కొండయ్య, కాంగ్రెస్ నాయకుడు ఆంజనేయులుగౌడ్, కృష్ణయ్యగౌడ్, మహదేవమ్మ, సుమిత్ర, కృష్ణయ్యగౌడ్, సుదర్శన్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, కృష్ణముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లిలో నిర్వహించిన సీఎం కప్ అథ్లెటిక్స్‌లో మొగుల్‌మడ్క ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. మండలంలోని మొగుల్‌మడ్క గ్రామానికి చెందిన విద్యార్థులు 400 మీటర్ల పరుగు పందెంలో వైశాలి ప్రథమ స్థానంలో నిలిచింది. 200 మీటర్ల పరుగు పందెంలో అశ్విని, మొదటి స్థానం సాధించింది. వందమీటర్ల పరుగు పందెంలో శ్రవంతి మొదటి స్థానంలో నిలిచింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈఓ కృష్ణారెడ్డి అభినందించారు.

ధర్మాగ్రహ దీక్షకు తరలిరండి



నారాయణపేట రూరల్: ఉపాధ్యాయ సమస్యల సాధనకు ఈ నెల 17న తపస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మాగ్రహ దీక్షను విజయవంతం చేద్దామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ బీఎడ్ కళాశాలలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, నూతన పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఇంద్రపార్క్ వద్ద చేపట్టనున్న దీక్షలో జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు గుంపు బాలరాజు, జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా కార్యదర్శి నర్సింహ పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

- న్యాయమూర్తి వై జానకి



ఆత్మకూర్: ఆత్మకూర్‌లోని మున్సిఫ్ మ్యాజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన మెగాలోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా న్యాయమూర్తి వై జానకి మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్షణికావేశానికి గురై కేసులు పెట్టుకొని, కోర్టుల చుట్టూ తిరగడం వల్ల ఎంతో విలువైన సమయం వృథా అవుతుందని, రాజీమార్గమే రాజమార్గమని పేర్కొన్నారు. అనంతరం వివిధ రకాల క్రిమినల్ కేసులు, డ్రంకెన్‌డ్రైవ్, ఇతర పోలీస్ కేసుల ద్వారా రూ.3.30 లక్షల జరిమానా విధించగా, మొత్తం 1060 కేసులు పరిష్కరించి కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు దివాన్జీ అశోక్‌రావ్, విజయభాస్కర్‌రెడ్డి, న్యాయవాదులు వై తిప్పారెడ్డి, జీకే రాములు, నారాయణగౌడ్, రామేశ్వర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, బీవీ రత్నం, ముక్తేశ్వర్, శంకర్‌లింగం, ఏపీ రాజేందర్, కృష్ణ, కిషోర్, విజయ్ కుమార్, అశోక్‌గౌడ్, అబ్రహం, మన్యం, వినోద్, వర్కటం శ్రీనివాస్‌రెడ్డి, లోక్ అదాలత్ సిబ్బంది, ఆయా మండలాల పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు వసతులు కల్పిస్తున్నాం

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ఆత్మకూర్‌లోని ఎస్సీ బాలికల హాస్టల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, సదుపాయాలు కల్పిస్తున్నామని, సంక్షేమ వసతిగృహాల్లో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూర్‌లోని ఎస్సీ బాలికల వసతిగృహం, బీసీ బాలుర వసతి గృహాల్లో ఎమ్మెల్యే సందర్శించి భోజనం, సౌకర్యాలను పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి 40 శాతం అదనంగా మెస్‌చార్జీలు పెంచారని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వార్డెన్లు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్ సాధిస్తా..

గత వైభోవం కోల్పోయిన ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చి పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. అఖిలపక్షం, రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో వందలాదిమంది మక్తల్ ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం ఆత్మకూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో అఖిలపక్షం, రెవెన్యూ డివిజన్ సాధన సమితి నాయకులతో సమావేశమయ్యారు. నారాయణపేట జిల్లాలోని మక్తల్, వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్లుగా ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించానని, అందుకు సీఎం సానుకూలంగా ఉన్నారని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు, డివిజన్ సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.

అమరచింత: గురుకులాలు, వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులు మెచ్చుకులా ఉన్నత లక్ష్యాలు సాధించాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. రాష్ట్రం మొత్తం వసతి గృహాల్లో 16 లక్షల మంది విద్యార్థులకు రూ.470 కోట్లు సీఎం విడుదల చేశారన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ డీపీఓ సురేష్ కుమార్, వార్డెన్ చంద్రన్, ఎంపీఓ నరసింహులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

సహాయం చేసే గుణం ఉండాలి

ప్రతి ఒక్కరు సేవ గుణం కలిగి ఉన్నప్పుడే తమ గొప్పతనం గురించి ఇతరులు ఆలోచించే స్థాయికి ఎదుగుతారని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు వైడూర్య, ఆదాంలు క్రిస్మస్ సందర్భంగా పాస్టర్‌లు నిరుపేదలకు నూతన వస్త్రాలు అందించడం అభినందనీయం అన్నారు. ఈమేరకు ఎమ్మెల్యే ఆయా మండలాలకు చెందిన పలువురు పాస్టర్‌లు, వితంతువులు, నిరుపేద మహిళలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ దంపతులతో పాటు ఎంబీకర్మేల్ చర్చి పీల్డ్ చైర్మన్ లూథర్, పాస్టర్ హ్యాపీపాల్, కాంగ్రెస్ నాయకులు ఆయూబ్‌ఖాన్, అరుణ్ కుమార్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం హోమం, విగ్రహాల ధన్యాదివాసం, నవగ్రహహోమం మంగళహారతి పూజలు చేశారు. ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళ భక్తులు పాల్గొన్నారు. ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న నవదంపతులు

వైభవంగా దత్తాత్రేయస్వామి డోలారోహణం

నారాయణపేట రూరల్ : పట్టణంలోని సద్గురు అవధూత నర్సింహాస్వామి మఠంలో శనివారం దత్త జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, పాదపూజ, బిల్వార్చన, అష్టోత్తరనియామవళి, పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, యజ్ఞం తదితర పూజలు నిర్వహించారు. అదేవిధంగా మహిళల జ్యోల పాటలతో బాజాభజంత్రీలతో స్వామివారి డోలారోహణం నిర్వహించారు. అనంతరం నైవేద్యం మహామంగళహారతి చేసి భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం నిర్వహించారు. మఠం అభివృద్ధికి ఆర్థిక సాయం అందించిన విశ్రాంత ఉపాధ్యాయులు సుజాత, వైద్యులు గీత విశ్వనథ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో మఠం కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి డోలారోహణంలో పాల్గొన్న మహిళలు